చెహోవ్ కథ



# మాయాదర్పణ్




భూత్ బంగ్లాలాంటి ఆ భవంతిలో ప్రవేశించటానికి సందేహించిన మాట వాస్తవం. ఎలుకల, పందికొక్కుల సైన్యాన్ని చూసి మా ఆవిడకు మూర్ఛవచ్చినంత పనైంది. ఏళ్ల తరబడి గాలీ, వెలుతురూ చాలని గదులు. చెమ్మతో నాచుపట్టిన గోడలు.. ముక్కులు పగిలే దుర్వాసన. కిటికీలు తెరవగానే కట్టలుకట్టలుగా పడివున్న కాగితాలు ఎగిరి యిల్లంతా వ్యాపించాయి. ఆనాటి బొమ్మలు, మా పూర్వీకుల దస్తూరి, గోడలకు మా వంశపురుషుల , స్త్రీల చిత్రపటాలు. వాళ్ల మొహాల్లో ఎంత ఠీవి. ఎంత గర్వం.

"సింహాల వంశంలో పుట్టిన వూరకుక్కవి: నాగుల వంశంలో పాకుతున్న వానపాముని" అన్నట్టుగా చూస్తున్నారు నావేపు.

ఆ నిశ్శబ్దంలో మాపాదాల అలికిడి మాకు వింతగా వినిపించింది. దగ్గితే దగ్గు ప్రతిధ్వనించింది. అవును. అది నా పూర్వజుల ప్రతిధ్వని.

గతించిన మా ప్రాభవానికి గాలి రోదించింది. తరాల ఘనకీర్తి దుమ్ము కొట్టుకుపోతే ఎంత నిర్వేదం. ఆకాశం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నది. తలుపుల మీద వడగళ్ల పలకరింపు.

"నా పితృదేవతలకు జోహార్లు. నేనే రచయితనై వుంటే ఆ చిత్రపటాల్లోని ఒక్కొక్క మహాపురుషుణ్ణి గురించీ ఒక్కొక్క మహాకావ్యం రాయనా? ఎన్ని ప్రేమకావ్యాలు, ఎన్ని సాహసగాథలు గానం చెయ్యగలిగిన జీవితాలు కదా వాళ్లవి. ఆవిడెవరూ.. నా ముత్తాత తల్లి.

**రష్యన్‌మూలం: చెహోవ్**
**తెలుగు గొంతు: కరుణారుణ**

దేశాలేలే రాణిలా వున్నదా ముఖవర్చస్సు. "ఆమె గురించి నాకో కథ తెలుసు. ఆ మూలాన ఓ అద్దం వున్నది చూశావా?" అంటూ ఈ లోకంలోకి వచ్చి పలకరించాను మా ఆవిడను.

ఇత్తడి ఫ్రేములో బిగించిన నిలువుటద్దం.

"ఆ అద్దానికి మంత్ర శక్తులున్నాయి. ఆమె మృత్యువుకు కారణం ఆ అద్దమే. అది ఆమెను ఎంత ఆకర్షించిందంటే, చివరకి సగం ఆస్తి తగలేసి దాన్ని కొనేదాకా నిద్రపోలేదు. అంతే. ఆ రోజునుంచీ ఆమె ఒక్కక్షణం కూడా దాని ముందునించి కదలలేదు. తిన్నా, తాగినా, మరేంచేసినా, అద్దం తన ముందుండాల్సిందే. చివరకి, పడుకునేటప్పుడు కూడా వెంట తీసుకెళ్లేది. ఆమె చివరికోరిక దాన్ని తనతోపాటు సమాధి చెయ్యమని. అది వీలుపడలేదనుకో. ఎంత ప్రయత్నించినా శవపేటికలో పట్టలేదది."

"ఒంటి సింగారం తప్ప వేరే ధ్యాస లేదా ఏమిటావిడకు?"అంది నా భార్య.

"అయితే కావచ్చు. కాని ఇంట్లో ఎన్ని అద్దాల్లేవని? ఇదే ఎందుకావిడకు అంత అవసరం? నో. ఇందులో ఏదో రహస్యముంది. ఏ దేవతో, దయ్యమో దీన్ని ఆవహించిందని అంటారు. పైగా మా పూర్వజులకి భూతప్రేతాలమీద గొప్ప నమ్మకం."

అద్దంమీద పేరుకుపోయిన దుమ్ము దులిపి, నా ప్రతిబింబం చూసుకొని బిగ్గరగా నవ్వాను. నవ్వు యిల్లంతా ప్రతిధ్వనించింది. అది వంకర అద్దం. నా మొహం వికృతంగా, సాగదీసినట్టుగా, ముక్కు పక్కకు జరిగి చెవుల దగ్గిర వున్నట్టుగా కనిపించింది.

"ఏమైనా, ఆవిడ అభిరుచికి ఆశ్చర్యపడకతప్పదు." అన్నాను.

నా అభిప్రాయాల్ని ఎప్పుడూ లెక్కచెయ్యని మా ఆవిడ సందేహిస్తూ వచ్చి అద్దంలో చూసుకుంది. అంతే. ఆ క్షణం ఆవిడలో ఒక వింత మార్పు వచ్చింది. మొహం తెల్లబడింది. తనను తాను నమ్మలేక కేకవేసింది. చేతిలో వున్న కొవ్వొత్తి కిందపడి కాగితాలంటుకున్నాయి. మంట ఎలాగో ఆర్పేశాను. ఇల్లంతా చీకటి నిండింది. 'ధబ్'మని కిందపడ్డ నిశ్శబ్దమైంది. ఇంకేముంది. మా ఆవిడ మూర్ఛపోయింది.

గాలి రోదన హృదయ విదారకంగా వున్నది. ఎలుకలు దండెత్తివచ్చాయి. పందికొక్కులు విజయోత్సాహంతో లంఘించాయి. నాకు భయంతో వెంట్రుకలు నిక్కపొడుచుకున్నాయి. చంద్రుడు భయం భయంగా తొంగిచూశాడు.

మా ఆవిడను లేవనెత్తి ఎలాగోలా యింటి బయటకు తీసుకొచ్చాను. మర్నాడు సాయంత్రందాకా ఆవిడకు స్పృహ రాలేదు.

కళ్లు తెరిచిన క్షణాన ఆమె నోట వచ్చిన మొదటి మాట. "అద్దం. నా అద్దం నాకివ్వండి."

వారం గడిచింది. నిద్రాహారాలు లేవు. అన్నపానాదులు లేవు. "అద్దం. అద్దం, అద్దం." అది తప్ప వేరు మాట రాలేదామె నోట. ఏడ్చింది. జుట్టు పీక్కుంది. దుస్తులు చింపేసుకుంది. నిందారోపణలు చేసింది. అద్దం లేకపోతే ఆమరణ నిరాహారదీక్షచేసి ప్రాణం విడుస్తానన్నది. డాక్టరు వచ్చాడు. పరీక్షచేసి పెదవి విరిచాడు.

"ఆమె ప్రాణం అద్దంలో వుంద"న్నాడు.

నిజమే. అది లేకపోతే ఆమె బతకదు. చివరికి, ఏమైతే అదైందని, అన్నింటికీ తెగించి, దయ్యం ఆవహించిన అద్దాన్ని తెచ్చిచ్చాను.

ఆమె ఆనందానికి అవధుల్లేవు. అద్దాన్ని ముద్దాడింది. కౌగలించుకుంది. పక్కలో పెట్టుకుని పడుకుంది.

పదేళ్లు గడిచాయి. ఒకరోజు, ఒక్క క్షణం ఆమె దానికి దూరంగా వుంటే వొట్టు.

"అందులో వున్నది నేనేనా?" అంటుందామె, నమ్మలేక, కళ్లను చక్రాల్లా తిప్పుతూ.

"నేనే. నేనే. అద్దం అబద్ధమాడదు. ఆహా, పెళ్లికిముందే నాకీ అద్దం దొరికుంటే, నాజీవితం ఎలా మారిపోయేదో కదా! నావంటి అపురూప లావణ్యరాశి కరుణాకటాక్షం కోసం ఎందరు సుందరాంగులు, రాకుమారులు బారులు కట్టి నిల్చునేవాళ్లో కదా! ఈ మొగుడు నా కాలి గోరుకైనా తగడే." అనుకుంటూ పశ్చాత్తాపపడుతుంటుంది.

ఒకనాడు నేనామె వెనకే నిల్చుని అద్దంలోకి చూస్తే గాని అర్థం కాలేదు, మా ఆవిడ మనస్తాపానికి అసలు కారణం. అందులో కనిపించిన ప్రతిబింబం అద్భుత సుందరిదే. ఆమె ఎలా వుంటుందో నేను మీకు చెప్పను గాని అద్దంలో మాత్రం ఆమె జగన్మోహిని. ఏమిటా కళ్లు చెదిరే అందం! ఏమిటా లాస్యం! ఏమిటా ముగ్ధమోహన సౌకుమార్యం! ఆవిడ దగ్గరకు వస్తానంటే తలపక్కకు తిప్పుకుంటానే నేను."

అసలు రహస్యం ఏమిటంటే, ఈ వంకర అద్దం మా ఆవిడ వికృతత్వాన్ని సమ్మోహనవరంగా మార్చింది. ఆ కళ్లూ, ముక్కూ, పెదాలూ, గడ్డం అద్దంలో జగదేకసుందరి కుండాల్సిన ఆకర్షణలతో కనిపిస్తున్నాయి.

నేనూ, మా ఆవిడా అద్దంలోకి చూస్తూ కూర్చుంటాం. నాది చప్పిడి ముక్కు. ఆవిడది కోటేరులాంటి ముక్కు. నావి గాడిద చెవులు. ఆవిడవి లేత తమలపాకులు. నా పెదవులు... ఎందుకు లెండి వర్ణనలు.

నామీద నాకు జాలి.

'హ హ్హ హ్హ' అంటూ విరక్తిగా నవ్వుతాను.

సౌందర్య రహస్యాన్ని కనుగొన్నట్టుగా ఆవిడ గర్వంగా నావైపు చూస్తుంది. ■

## మ్యూజిక్ వీడియోలో ఆమీర్

ప్రముఖ గీత రచయిత కైఫీఆజ్మీ మరణించాక, ఆయన రచనలు ఆధారంగా ఓ మ్యూజిక్ వీడియో తయారవుతున్నది. ఆల్బమ్‌లో ఎనిమిది గీతాలుంటాయి. ఇక్కడ చెప్పుకోదగిన విశేషం, వీటిలో 'ప్యార్ కా జశ్న్' అనే గీతంలో ఆమీర్ ఖాన్ చేయటం. దీనికి సంగీతం రూప్‌కుమార్ రాఠోడ్. వీడియో తయారు చేస్తున్నది కైఫీఆజ్మీ పుత్రుడు బాబాఆజ్మీ. పాట ఎలా మొదలవుతుందంటే, "జబ్ భీ చూమ్ లేతా హూఁ ఇన్ హసీన్ ఆంఖోం కో, సౌ చిరాగ్ అంధేరే మేఁ ఝిల్‌మిలాతే హైఁ."-ఈ కళ్లను చుంబించినప్పుడల్లా చీకట్లో వంద దీపాలు వెలిగినట్లవుతుంది అని. మరి ఈ కళ్ల తాలూకు సుందరెవరో?

